

# దేశపటం

—ముప్పిడి ప్రభాకరరావు

మా అమ్మా, నాన్నా అయిన దానికీ, కాని దానికీ ఎప్పుడూ ఏదో గొడవ పడడమే. వాళ్లకి అదొక అలవాటై పోయింది. చినికి చినికి గాలివాన అయినట్టు ప్రతి చిన్న విషయమూ చివరికి పెద్ద రగడగా అవుతుంది. ఆయన ఆమెను కొడతాడు, ఆమె ఆయన్ను తిడుతుంది. ఇరుగూపొరుగూ వున్నారని గానీ, వాళ్లు వింటే పరువు పోతుందని గానీ ఆ ఇద్దరికీ ఎక్కడా ఏ కోశానా వుండదు.

ఇతరుల సంగతి ఎలా వున్నా ఇంట్లో కనీసం పసివాళ్లం మేమున్నామని గానీ, మా లేత హృదయాలు వాళ్ల చేష్టల వల్ల భయభ్రాంతులకు లోనై నిస్సహాయతకూ, నిర్వే దనకూ గురౌతాయని గానీ ఏనాడూ ఊహించి వుండరనే అనుకుంటాను.

పెద్దల్ని విమర్శించడం,. వాళ్లు ఫలానా విధంగా తప్పని సరిగా నడుచుకోవాలని నిర్దేశించడం నా ఉద్దేశం కాదు.

అయితే వాళ్ల ప్రవర్తన తమ బిడ్డల పాలిట శాపంగా మారకూడదని మాత్రం అంటాను. ఎందుకంటే—

నేనా సంవత్సరం వాళ్లో తరగతి తప్పాను.


నేనా సంవత్సరం పరీక్ష తప్పడానికి కారణం మా పక్కింటావిడే-ఆమె స్వయానా నాకు క్లాసు టీచరు, మా మిస్—

ఆ తర్వాత నా చదువు గురించి అనేక తర్జన భర్జనల్తో ఓ నిర్ణయానికొచ్చారు. నా తండ్రికి నా తెలివితేటల మీద అపారమైన విశ్వాసముంది. ఆ కారణంగానే, నాల్గవ తరగతి తప్పిన నన్ను ప్రైవేటు కాండిడేట్‌గా ఎంట్రన్సు రాయించి హైస్కూల్లో ఆరవ తరగతిలో చేర్పించారు.

ఇది మా పక్కింటావిడకు చెంపపెట్టు-

కొత్త స్కూల్లో, కొత్త వాతావరణంలో ఇమడ డానికి ఏమంత కాలం పట్టలేదు. కొత్త మాష్టార్లూ... కొత్త విద్యార్థులూ... అంతా బాగానే వుంది కొత్తక వింతలా... పైగా నా చేతిలో అన్నీ కొత్త పుస్తకాలే... ఆ పుస్తకాలను చూస్తుంటే నా ప్రాణం లేచి వచ్చేది.

ఆ రోజు మాష్టారు 'సాంఘిక శాస్త్రం' చెప్తున్నారు. నేను దానికి సంబంధించి నా పుస్తకంలోని 'దేశపటాన్ని' చూస్తున్నాను. అది 'హిందూ దేశ పటం' ఔనో, కాదో తెలియకుండా వుంది.



దేశమంటే మట్టికానట్టు దేశ పటం అంటే కాగితం మీద గీతలు కాదు. దేశమంటే మనుషులైతే దేశపటమంటే ఆ మనుషులకు దేశం పట్ల స్ఫూర్తినిచ్చే సెంటిమెంట్.

మనిషి మనిషిగా బతక లేకపోతే, 'ఏదో ఒక 'కులం' గానో, 'మతం' గానో, 'ప్రాంతం' గానో, 'పేద' గానో, 'ధనికుడు' గానమాత్రమే బతికేటట్టయితే...ఆ 'సెంటిమెంట్' దెబ్బ తింటున్నట్టే. ఆ దేశం కుదించుకు పోతూ, దాని అస్తిత్వం అంతరించి పోతున్నట్టే. నిత్య జీవితం ఎడతెగని వేదుపాటగా, సమస్యల సుడిగుండంగా వున్నప్పుడు... పునర్నిర్మాణం అంత తేలిక కాదు.

అవాక్కయ్యాను. ఓ అపరిచిత వ్యక్తిని చూసినట్టు నా కళ్లు ఆ పటం కేసీ, 'హిందూ దేశం' అన్న అక్షరాలకేసీ చూశాయి.

గుండెల్నిండా ఏదో అయోమయం-

ముమ్మాటికీ ఇది 'హిందూ దేశ పటం' కాదు గాక కాదు. నేను విడిచి వచ్చిన మిషనరీ స్కూలు గుర్తుకొచ్చింది. ఆ తరగతి గదుల్లో విశాలమైన గోడల మీద బొమ్మలూ, చార్టులూ, మేప్‌లూ గుర్తొచ్చాయి. అన్నిటినీ మించి ఖాళీగా వున్న బ్లాక్ బోర్డులపై వేసిన ఓ రెండు చిత్రపటాలు నా స్మృతి పథంలో ఇంకా నిలిచే వున్నాయి. నా లేత హృదయాన్ని హత్తుకుపోయి, చెరగని ముద్ర వేశాయి. అందులో ఒకటి 'దిశలూ-ఎల్లలు'.

ఉదయించే సూర్యుని వేపు తిరిగి రెండు చేతులూ బార్లా చాచి నిలిచిన బాలుడు. అతనికి తూర్పు పడమర, ఉత్తర దక్షిణాలు, వాటి మధ్య ఎల్లలూ గుర్తించబడ్డాయి. నేనా వయసులో దానికేసి ఎంతో ముచ్చటగా చూశాను. అంత ముచ్చట గానూ చూసుకున్న రెండవ చిత్రం—

'హిందూ దేశ పటం'

నల్లని బ్లాక్ బోర్డు మీద తెల్లని సుద్దముక్కతో గీసిన 'భరత ఖండం'. ఈ రెండు చిత్రాలనూ పెన్నుల్తో, పెన్సిళ్లతో, సుద్దముక్కల్తో ఎన్నెన్ని చోట్లనో గీసాను. మా ఇంటి గోడల మీద సైతం అవే-నా నోటు పుస్తకంలో సైతం అవే-అట్ట లోపల ఇరువైపులా వేసుకుని, ముందు సంవత్సరాల కోసం అట్టే పెట్టుకున్నాను.

'దేశపటం' వంటి ఓ చిత్రం ఏముందని అభం శుభం ఎరగని ఓ పసి హృదయాన్ని అంతగా హత్తుకుంది-అని కొందరు అడగవచ్చు-

మరి కొందరు దీనికి, పూవు పుట్టగనే పరిమళించినట్టు, దేశాభిమానం అనో, మరోటనో భాష్యం చెప్పవచ్చు.

నిజానికి 'నాది' అన్న మహత్తు తప్ప, దేశభక్తి అనేది ఆ చిరు వయసుకు చేతగాని పని.

అయితే నేనా చిత్రాలను ఏ స్ఫూర్తితో వేసుంటాను!

ఆ నాటినా లేత హృదయానికి ఈ 'భరత ఖండం' ఓ విచిత్ర రూపంలో, ఒక 'ఆవు'లా కనిపించింది.

చంద్రుడిలో 'జింక'ను చూసినట్లే నేను నా దేశపటంలో ఓ 'గోవు'ను చూశాను.

కాశ్మీరము దాని తలకట్టు లానూ, పంజాబు సింధులు దాని ముఖం లానూ, బర్మా రంగూన్‌లు దాని తోకలానూ, బెంగాల్ దాని చనుకట్టులానూ కనిపించసాగింది.

మతాన్నీ, సెంటిమెంటునీ అవతల పెట్టేస్తే... నిజానికి నా దేశ పటం 'గోమాత' లానే వుంది.

'అంబా' అని అవులించిన నోరులా బెలుచిస్తాన్ కనిపించగా, అడుగున శ్రీలంక దాని బుల్లి దూడలా ఒదిగి వుంది.

నేనా భావోద్రేకాలను ఏనాటికీ వివరించ లేనేమో.

ఆరు బయలు వేసవి వెన్నెట్లో వెల్లకిలా పడుకుని, చల్లగా సాగిపోయే పున్నమి చంద్రుడిలోని 'జింక'ను చూస్తుంటే మనసెంతగా మైమరచి మురిసేదో, ఆ నల్లని బ్లాక్ బోర్డు మీద తెల్లని సుద్దముక్కతో గీసిన నా 'భరత ఖండం' ఓ 'గోమాత'లా కనిపించగా నా హృదయం చెంగున లేచి అప్పుడేపుట్టిన దాని లేగలా పరవళ్లు తొక్కేది. నా ఊహాంచలాన్ని తట్టి తన్మయ పరిచేది.

కాని ఇప్పుడు?

ఇప్పుడు నా హిందూదేశం 'గోవు' లా లేదు.

ఇప్పుడు నా హిందూదేశం 'అంబా' అని పాలు కుడవడానికి దాని లేగల్ని పిలిచే 'గోమాత'లా లేనే

లేదు.

ఎందుకంటే—

'అంబా' అని పిలవడానికి దాని నోరేదీ?

దాని లేగలు పాలు కుడవడానికి దాని చనుకట్టేదీ?

ఇంటివద్ద నోటు బుక్కులో క్రిందటేడాది
గీసుకున్న పటాన్ని తీసి నా ముందుంచుకుని రెంటినీ
సరిపోల్చుకున్నాను. నా చిన్న చేతుల్తో తడిమి తడిమి
చూసుకున్నాను.

ఎక్కడో ఏదో మోసం జరిగిపోయింది. ఎవరో
ఈ దేశాన్ని మార్చేశారు. ఈ కొత్త పుస్తకం నన్ను
ముమ్మాటికీ మోసం చేస్తోంది. ఎప్పుడూ మంచి
మార్కుల్తో పాసయ్యే నన్ను మా పక్కింటావిడ, నా
క్లాస్ టీచరు ఫెయిల్ చేసింది.

నా భవితవ్యాల్ని అస్తవ్యస్తం చేయడానికి నిర్దా
క్షిణ్యంగా తన ఏకపక్ష నిర్ణయాన్ని నాపై
అమలుపర్చింది..

ఆమె నా జీవనపురోగమనాన్ని ఒక సంవత్సరం
వెనక్కి లాగితే, నా తండ్రి ఒక సంవత్సరం
ముందుకు నెట్టారు.

నా భవిష్యత్తు పట్ల నా తండ్రి నిర్ణయం శ్లాఘ
నీయం. కాని బలైపోయిన నా జాతిపిత పటాన్ని నా
గదిలో ప్రతిష్టించి ముక్కచెక్కలై తరిగిపోయిన నా
దేశపటాన్ని పోగొట్టుకున్న మనస్సుతో సజల
నయనాల్తో నా యవ్వన కాలమంతా దిద్దాను.

'దిక్కులు-ఎల్లలు' లోకానికెంత నిత్య సత్యమో,
నా దేశపటం అంతటి నిత్యసత్యం అనుకున్న నా
విశ్వాసం వమ్మైపోగా- నేను నా చదువును పూర్తి
చేశాను.

చదువు పూర్తయిందన్న సంతోషంతోనూ, నేను
స్వతంత్రుణ్ణి అవ్వాలన్న ఆకాంక్షతోనూ జీవితం లోకి
అడుగుపెట్టాను.

పత్రికల్ని తిరగేసి అర్హతున్న ప్రతి చోటకీ
ఉద్యోగం కోసం దరఖాస్తు పెట్టాను. ఇంటర్వ్యూ వ
చ్చిన ప్రతి చోటకూ లేదనకుండా వెళ్లాను.

అయితే ఈ నా భరత ఖండంలో నే.వెళ్లిన
ప్రతిచోటా ప్రశ్నలే ఎదురైనాయి. ఎందుకంటే ఆ
ప్రశ్నలు అలాంటివి.

నీవే ప్రాంతం వాడివి? నీవే జాతి వాడివి? నీవే
భాష వాడివి? అన్న ప్రశ్నలు అడగడంలో వాళ్ల
ఆంతర్యం ఏమిటి?

ఈ నా దేశం 'మతం' ప్రాతిపదికగా ముక్క
చెక్కలయింది.

ఈ నా దేశం 'కులం' ప్రాతిపదికగా కుమ్ము
లాడుకుంటోంది.

మతం అడ్డుగోడల్ని కూల్చి, కులం సంకెళ్లను
తెంచి, కేవలం భారతీయుణ్ణనే అంకిత భావంతో
బతికే మనిషినీ, సమాజాన్నీ నా దేశం ఏనాటికీ
అందివ్వలేక పోయింది. నాల్గు పుష్కరాల సుదీర్ఘ
కాలానంతరం, ఈ స్వతంత్ర భారతం 'నీవు-నేను'
అన్న భేదభావాన్నుండీ 'మనం' అన్న ఐక్య భావానికి
మనిషిని తీసుకు రాలేకపోయింది. అందుకని
వాళ్లడిగిన ప్రశ్నలన్నిటికీ నా అభీష్టానికి వ్యతిరేకంగా
మనసు చంపుకుని సమాధానాలు చెప్పవలసివచ్చింది.

నీదే 'కులం' అన్నప్పుడు 'భారతీయుణ్ణి' అంటే
నాది తలబిరుసు సమాధానం అంటారు. పొగరు
బోతుగా జమకడతారు.

నీదే 'మతం' అన్నప్పుడు 'భారతీయుణ్ణి' అంటే
నా మీద కళ్లెర్రజేసి 'కులం, మతం లేకుండా మనిషి
ఎక్కడైనా వుంటాడా ఈ దేశంలో' అని తిరిగి
ప్రశ్నిస్తారు.

నీదే 'ప్రాంతం' అన్నప్పుడు 'భారతీయుణ్ణి'ని
అంటే అది తమ ప్రశ్నకు సమాధానం కాదంటారు.
నాకేసి అనుమానంగా చూస్తారు. ఏ దేశ
ద్రోహిగానో, అంతకన్నా నీచంగానో పరిగణిస్తారు.
కొందరికది నేరంగానూ అనిపించవచ్చు. మరి
కొందరి కది విపరీతంగానూ వినిపించవచ్చు.
అలాంటప్పుడు నేను భారతీయుణ్ణన్న నేరానికీ, నా
తలబిరుసు సమాధానానికీ నేను నిలుచున్న నేలకింది
మట్టినీ, నేను పీల్చి వదిలిన గాలినీ ఏలినవారు పరీక్షకై
పైకి పంపించనూ వచ్చు.

అందుకని 'భారతీయుణ్ణ'న్న సమాధానం చెప్పే
నేరస్తుణ్ణి కాదలచుకోలేదు. వినమ్రుడనై అడిగిన ప్రతి
దానికీ వాళ్ల అభీష్టం మేరకే సమాధానం చెప్పాను.

కానీ అన్ని తత్వాలకూ ఆలంబనైన ఈ గడ్డమీద
అంత తేలికా ఓ ఉద్యోగం రావడం-

నా ఉద్యోగాన్వేషణలో నేనీ భారతావనిలో తిరగని
దిక్కుల్లేవు. చూడని ఎల్లల్లేవు. కార్బను పేపరుతో
దేశపటాన్ని దిద్దినట్టే మళ్లీ నా దేశ పటాన్ని ఈ
రూపేణా నేను మరోసారి కాళ్లకు బలపాలు కట్టుకుని
పూర్తిగా దిద్దాను.

ముక్కచెక్కలైన ఈ దేశాన్ని తిరగడానికే ఇంత
కాలాన్నీ, ధనాన్నీ వ్యర్థంగా వెచ్చించవలసి వస్తే,
ముక్కచెక్కలు గాని ఆ నాటి అఖండ భారతమే
నేటికీ వుంటే, నేనింకెంత వ్యయప్రయాసలకు లోనై
ఇంకెంత కాలాన్ని ఇలా వృధా చేయాల్సి వచ్చేదో కదా
అనుకున్నాను.

నిజమే! నేను నా ఉద్యోగాన్వేషణలో పొందిన
అసంతృప్తినీ, అలసటనీ అంత తేలికగా కొట్టిపారేయ
తగింది కాదు.

తరిగిపోయిన నా భారతదేశం ఈ రకంగా నాకు
ఊరట కల్గించడం ఏమాత్రం సంతోషించ తగిన
విషయం కాదని నా మనసుకు తట్టి, నా సంకుచిత
భావానికి సిగ్గుపడ్డాను. కానీ ఇంకా సిగ్గు పడాల్సినవి
జీవితంలో ఎన్నో జరిగాయి.

నాకు ఉద్యోగం దొరికింది.

ఏటికి ఎదురీది ఓడిపోయిన వాళ్లకు నలుగురు,
నడిచిన త్రోవే మంచిదనిపించడంలో ఆశ్చర్య
మేముంది?

నేనూ ఉద్యోగం చేస్తున్నాను.

నెల నెలా నాకు నెల జీతం అందుతోంది.
కుటుంబం కొదువ లేకుండానే ముందుకు
సాగుతోంది.

కానీ ఈ ఉద్యోగంలో నేనేపాటి సుఖపడు
తున్నాను?

ఈ అసంతృప్తికి గల కారణం ఏమిటి?

'జాబ్ ప్లజర్' అనేది ఏ కొద్ది మందికో తప్పించి
మిగతా వాళ్లెవరికీ అందని అపురూపమైన
వస్తువినాడు.

ఈ వ్యవస్థలో సిన్సియారిటీకి గుర్తింపు లేదు.

ఓ చెల్లని రూపాయికున్న విలువ చెల్లే రూపాయికి
లేదు.

పని దొంగలకీ, లంచగొండులకీ, అసమర్థు లకీ...
వాళ్ల వాళ్ల కులాలు కవచకుండలాలు- వాళ్ల వాళ్ల
ప్రాంతీయ తత్వాలు కంచుకోటలు.

వాటిని పరిరక్షించుకోవడం కోసం నిత్యం నిప్పులు
చెరుగుతూ, కత్తులు నూరుతూ రావణ కాష్టంలా
కాలుస్తుంటారు.

మానవుడే మరొక మానవుడి భవిష్యత్తుకు
పునాది వేయాల్సిన ఈ తరుణంలో ఈ నా దేశంలో
జరుగుతున్నదేమిటి? కేవలం నీతి, నియమాలని
ఏడ్చేవాళ్లు తప్ప మిగిలిన వాళ్లంతా హాయిగా
జీవించడం తప్ప-

మిత్రుడా నీ వెందుకు ప్రేమిస్తున్నావంటే... నా
కులం వాడవని- సోదరీ నీ వెందుకు ప్రేమి స్తున్నా
వంటే.. నా మతం వాడవని- మరి నీ వెందుకు
ద్వేషిస్తున్నావంటే నా కులం వాడవు కాదని- ఇక నీ
వెందుకు ద్వేషిస్తున్నావంటే... నా మతం వాడవు
కావని- ఈ దేశానికి స్వతంత్ర్యం ఎందుకు వచ్చినట్టు!

ఈ నలభై ఏళ్లలో ఏలినవారు ఏం సాధించినట్టు-

మిసైల్ రాకెట్టులా...? మిలిటరీ ప్లెటూనులా?

రూర్కెలా, భిలాయిలా? భాక్రానంగల్,
నాగార్జునసాగరులా? ఆకాశ హర్మ్యాలా, ఆనకట్టలా,
ఆటంబాంబులా, అణురియాక్టరులా? ఈ దేశం
సాధించిన పరమార్థం ఏమిటి? ఏ స్వప్నం నిజం కావ
డానికీ స్వాతంత్ర్యం-ఈ దిగ్విజయం?

నేను ఉద్యోగానికి రాజీనామా సమర్పించాను.

నిర్మాణాత్మక శక్తిగా వుండాల్సిన నేను ఇంటిలో
ఏకాకితనం అనుభవిస్తున్నాను.

అనైక్యత-

అనైక్యతలో ఎప్పుడూ ప్రమాదం పొంచే వుంటుం
ది. నా ఈ జాతి 'దేశభక్తి' అనే తలుపు తట్టేవరకూ

పటిష్టమైన కట్టడాలకు
చిరకాల మన్నికకు
భీమ సిమెంట్

ఈ దేశంలో ప్రశాంతత వుండదు.

సాయంకాలం నీరెండ చల్లగా జారుకుంది.

నేను నా గదిలో కూచుని పుస్తకంలో మునిగిపోయాను. కారల్ మార్క్స్ రాసిన 'భారత తొలి స్వాతంత్ర్య సంగ్రామం' అది. కొందరు దీనిని 'సిపాయి మ్యూటిని' అన్నారు.

నేను ఆలోచనలో పడ్డాను. సిపాయిలు ఎందుకు కలహించినట్టు అని- అప్పుడు నన్ను ఓ రెండు చేతులు వెనగ్గా వాటేసుకున్నాయి. మృదువుగా... మెత్తగా...

ఆ స్పర్శిస్తున్న చేతులు ఎవరివో నాకు తెలుసు. ఆ చేతులు నన్నెప్పుడూ అలానే లాలనగా స్పర్శిస్తూ వుంటాయి.

వాడు మా చిన్న కొడుకు నాల్గో తరగతిలోకి వచ్చాడు.

వాడు తన పాఠ్యపుస్తకాన్ని తెరిచి నా ముందుంచాడు. అందులోని పటాన్ని నన్ను గీసి పెట్టమన్నాడు.

నేను వాడి కళ్లల్లోకి చూశాను. ఆ కళ్లల్లో అచంచలమైన విశ్వాసం- వాడు భారతదేశ పటాన్ని నా ముందుంచాడు.

నేనా 'భారతదేశం' వైపు తిరిగాను.

ఎప్పటివో అనేక జ్ఞాపకాల దొంతర్ల అట్టడుగున ఓ చిన్ని నిప్పు రవ్వలా ప్రజ్వరిల్లుతూ ఆ నాటి నా హృదయాన్ని కలచి వేసిన సంఘటన- ఇప్పుడు మళ్లీ గుర్తుకొచ్చింది.

నిప్పుకణం నివురు కప్పి వున్నా... పైకి ఏమీ లేనట్టే కనిపిస్తున్నా, ఏ చిరుగాలికో రాజు కుంటుంది. ఏ సుడిగాలికో ప్రజ్వరిల్లుతుంది. పరిసరాల్ని దహించి వేస్తుంది.

జ్ఞాపకాలూ అలాంటివే-

వాడు నా ముందుంచిన దేశ పటాన్ని చూస్తున్నాను. వయసు మీద పడ్డంతో చూపు కాస్త సన్నగిల్లింది. కళ్లద్దాలు సరిచేసుకుని, ఆ పటం కేసి దృష్టి సారించాను.

అయినా నా దేశం ఇంకా అలుక్కుపోయే కనిపిస్తోంది.

నా బాల్యంలో 'గోమాత'లా నా ఊహల్ని అలరించిన దేశపటం, ముక్క చెక్కలై, చిక్కి శల్యమై, తరిగిపోయిన దేశపటం, నా కళ్లద్దాల వెనుక, నా కనురెప్పల మాటున వృత్తాలు తిరుగుతూ వున్న రంగుల్లోంచి గిరికీలు కొడ్తూ, అలుక్కుపోయి కనిపిస్తోంది.

ఎన్నో అనుభవాల మధ్య... ఎన్నో జ్ఞాపకాల మధ్య...

ఎన్నో చేదు నిజాలమధ్య నా భారతదేశం-

పంజాబులో—కాశ్మీరులో—

దృఢంగా కదిలే నా చేయి కొంచెం వణుకుతోంది... ఏదో అనుమానంతో వెనకాడుతోంది... నా భారతదేశ పటాన్ని నేను మళ్లీ గీయడానికి— ●


A tremendous Presentation from the Volcanic Writer



"ఉద్యమాల ప్రారంభానికి కాలుతున్న కడుపులు కావాలి
ఉద్యమం ఆగకుండా సాగడానికి కాలుతున్న విద్యార్థులు కావాలి"
— నేడు ఆత్మాహుతులకు పాల్పడుతున్నది విద్యార్థులు కాదు;
పదవీ దాహంతో నాయకులు చేసే హత్యలవి!

భాషా ప్రభంజనం తోడై రాజకీయదమనకాండను
దహించేందుకు దూకిన రచనాదావాగ్ని




ఉగాది సంచిక నుంచి ప్రారంభం!